సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 29 । ఫిబ్రవరి । 2024

గరిష్ఠం/కనిష్ఠం
33.0/22.0

వాతావరణం
వాతావరణం నిర్మలంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉండి గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సృజనాత్మకత వెలికితీయాలి



సైన్స్ ప్రదర్శనలను పరిశీలిస్తున్న డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డీఈవో ప్రణీత అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శనలను పరిశీలించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఏదో ఒక రంగంలో అభిరుచి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహిస్తే అత్యుత్తమంగా రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతీనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..
జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని సరస్వతీనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆసక్తి పెంపొందించడానికి, విజ్ఞాన శాస్త్ర మేళా, సైన్స్ సెమినార్, ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, ఏఎంఓ శ్రీకాంత్, సీసీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఆర్డీవోగా ఏ.రాజేశ్వర్



బదిలీపై రానున్న రాజేశ్వర్

కైలాస్‌నగర్: పార్లమెంట్ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) బి.స్రవంతి వరంగల్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మెదక్ ఆర్డీవోగా పనిచేస్తున్న జి.అంబదాస్ రాజేశ్వర్ నియామకమయ్యారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రీజినల్ వర్క్‌షాప్‌కు డీఎంహెచ్‌వో



వర్క్‌షాప్‌లో డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్ టౌన్: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ రీజినల్ వర్క్‌షాప్‌నకు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన ఆరు రాష్ట్రాల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి వైద్యాధికారులు హాజరయ్యారు. ఇందులో ఆయుష్మాన్ భారత్ అమలు, తదితర అంశాలను వివరించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

పెద్దపల్లి డీఆర్డీవోగా రాథోడ్ రవీందర్

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్(ఏపీడీ)గా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన రాథోడ్ రవీందర్‌కు ప్రభుత్వం బుధవారం పోస్టింగ్ ఇచ్చింది. మంచిర్యాల ఏపీడీగా తొలుత పోస్టింగ్ ఇవ్వగా అక్కడున్న ఏపీడీని ప్రభుత్వం బదిలీ చేయలేదు. దీంతో ఆయన పోస్టింగ్ కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. తాజాగా పెద్దపల్లి డీఆర్డీవో ఏపీడీగా పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం డీఆర్డీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అవయవ దానం.. మరొకరికి ప్రాణదానం

ఆదిలాబాద్‌టౌన్: అవయవ దానం మరొకరికి ప్రాణ దానమని రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అవయవ దానంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఒక అవయవ దానంతో తొమ్మిది మందికి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ జనరల్ సర్జన్ పాండురంగం గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ.. వస్తున్నారు



- 41 ఏళ్ల తర్వాత దేశ ప్రధాని ఆదిలాబాద్‌కు రాక
- 1983లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఇందిరాగాంధీ..
- మార్చి 4న పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి రానున్న నరేంద్ర మోదీ
- ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్, ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించేనా..?
- పీఎం పర్యటనపై జిల్లావాసుల్లో ఆశలు

సాక్షి,ఆదిలాబాద్: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 41 ఏళ్ల తర్వాత దేశ ప్రధాని ఆదిలాబాద్‌లో పర్యటించనున్నారు. అప్పుడు ఇందిరాగాంధీ రాగా, ఇప్పుడు నరేంద్ర మోదీ రానున్నారు. 1983లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం ఇందిరాగాంధీ పర్యటించగా, నేడు పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్ర మోదీ విచ్చేయనున్నారు. ఈ పర్యటనపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

ప్రధానిటూర్ షెడ్యూల్..
మార్చి 4న మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హెలికాప్టర్ ద్వారా ప్రధాని మోదీ ఉదయం 10.20 గంటలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏరోడ్రాం హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. పలు ప్రాజెక్టులకు సంబంధించి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేయనున్నారు. ఆ తర్వాత బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇదిలా ఉంటే ఆదిలాబాద్‌లో గురువారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రధాని పర్యటనకు సంబంధించి పూర్తి విషయాలను తెలియజేయనున్నారు. కాగా జిల్లాలో మోదీ సుమారు రెండు గంటల పాటు గడపనున్నారు. ఆ తర్వాత ఇక్కడి నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్తారు. అక్కడినుంచి చెన్నైకు ఎయిర్‌క్రాఫ్ట్ ద్వారా చేరుకుంటారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న తర్వాత తిరిగి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చేరుకొని రాత్రి అక్కడే బస చేయనున్నారు. మరుసటి రోజు మంగళవారం సంగారెడ్డిలో పర్యటించనున్నారు.

ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌పై ఆశలు..
రాష్ట్ర రాజధానికి రైల్వేమార్గం అనుసంధానించే ఆదిలాబాద్-పటాన్‌చెరు ప్రణాళిక సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. మొత్తం కిలోమీటర్లు 317 కాగా, రూ.5,706 కోట్ల అంచనా వ్యయంగా పేర్కొన్నారు. ఈ రైల్వే ప్రాజెక్టుపై దశాబ్దాలుగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ప్రధాని పర్యటనలో దీనిపై ఏదైన స్పష్టతనిస్తారోనని వేచి చూస్తున్నారు. కొద్ది రోజులుగా ఆదిలాబాద్‌లో ఈ రైల్వేలైన్ విషయమై సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా రైల్వే ప్రాజెక్ట్ పనులను ఆదిలాబాద్ నుంచి ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పటాన్‌చెరు– ఆదిలాబాద్ మధ్య ఉండగా అటునుంచి పనులు ప్రారంభిస్తే ఇక్కడి వరకు పూర్తయ్యేందుకు దశాబ్దాలు పడుతుందని వారు అభిప్రాయ పడుతున్నారు. ఇదే డిమాండ్‌తో వారు ఈ దీక్షలు చేపట్టారు. అలాగే ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు సంబంధించి సుమారు 360 ఎకరాల స్థలంలో ఏరోడ్రాం విస్తరించి ఉంది. ఇక్కడ ఎయిర్‌పోర్ట్ గాని, విమానయాన శిక్షణ కేంద్రం నిర్మిస్తారని ఏళ్లుగా చెబుతున్నప్పటికీ రెండింటిలో ఏది నెరవేరలేదు. ఈ విషయంలోనూ ప్రధాని నుంచి ఏదైన స్పష్టత వస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కొత్త కలెక్టర్.. రాజర్షి షా

- మెదక్ నుంచి జిల్లాకు రాక
- రాహుల్‌రాజ్ మెదక్ కలెక్టర్‌గా బదిలీ



రాజర్షి షా, కొత్త కలెక్టర్

పేరు	: రాజర్షి షా
ఐఏఎస్ బ్యాచ్	: 2017
స్వస్థలం	: జైపూర్, రాజస్థాన్
విద్యార్హత	: బీటెక్, ఐఐటీ కాన్పూర్
తొలిపోస్టింగ్	: స్థానిక సంస్థల అదనపుకలెక్టర్,సంగారెడ్డి
కలెక్టర్‌గా తొలి పోస్టింగ్	: మెదక్
భార్య పేరు	: నిఖిత పంత్, ఐపీఎస్



రాహుల్‌రాజ్, బదిలీపై వెళ్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ కొత్త కలెక్టర్‌గా రాజర్షి షా నియామకమయ్యారు. ప్రస్తుత కలెక్టర్ రాహుల్‌రాజ్ మెదక్ కలెక్టర్‌గా బదిలీ కాగా అక్కడి కలెక్టర్ రాజర్షిషా జిల్లాకు రానున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎ.శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాహుల్‌రాజ్ బదిలీ కానున్నట్లుగా కొద్ది రోజులుగా అధికారవర్గాల్లో చర్చసాగుతుంది. ఈ క్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్ కలెక్టర్‌గా మూడేళ్లకు పైగా పనిచేసిన ఆయనకు ప్రభుత్వం స్థానచలనం కల్పించింది.

జిల్లాలో 13 నెలలు..
ఆసిఫాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తూ 2023 ఫిబ్రవరి 1న ఆదిలాబాద్ కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్ నుంచి రాహుల్‌రాజ్ బాధ్యతలు స్వీకరించారు. 13 నెలల పాటు జిల్లా కలెక్టర్‌గా సేవలందించిన ఆయన గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. పాలనలోనూ ప్రత్యేక ముద్ర వేసే దిశగా ముందుకు సాగారు. ప్రజావాణి అర్జీలను ఆన్‌లైన్ చేయించడంతో పాటు పెండింగ్ ఉండకుండా శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులంతా గ్రీవెన్స్‌లో ఉండేలా ఫోకస్ పెంచారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సమీక్షించడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాటి ఫలాలను ప్రజలకు అందించేలా శ్రద్ధ వహించారు. శాఖలపరంగా రానున్నఏడాదిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రణాళికను నిర్దేశించి తదనుగుణంగా సాగేలా అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి వనరుల సంరక్షణ, నిర్వహణ విభాగంలో జిల్లా యంత్రాంగం కృషికి ఫలితంగా జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నారు. గత నెలలో 17 మంది మండల పంచాయతీ అధికారులను ఏక కాలంలో బదిలీ చేసి తన మార్కు చూపించారు.



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఇంటర్ పరీక్షలు షురూ

- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్
- తొలిరోజు 9,690 మంది విద్యార్థులు హాజరు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆయా కేంద్రాల్లో సరిపడా సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. కొన్నిచోట్ల ఫ్యాన్‌లు, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. పరీక్షకు నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో విద్యార్థులు గంట ముందుగానే సెంటర్లకు చేరుకున్నారు. ప్రథమ సంవత్సరం మొదటి పరీక్ష కావడంతో తల్లిదండ్రులు, కుటుంబీకులతో కలిసి వచ్చారు. దీంతో ఆయా కేంద్రాల సందడి నెలకొంది. కొంతమంది విద్యార్థులు చివరి నిమిషంలో పరుగు తీస్తూ లోనికి వెళ్లడం కనిపించింది.

734 మంది గైర్హాజరు..
ప్రథమ సంవత్సరం పరీక్షలకు 10,424 మంది విద్యార్థులకు గాను 9,690 మంది హాజరయ్యారు. 734 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సీసీ నిఘా, ఆయా కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను పరిశీలించారు. డీఐఈవో రవీందర్‌కుమార్ ఆదిలాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలతో పాటు బాలుర జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు.



ఆదిలాబాద్‌లోని ఓ పరీక్ష కేంద్రం వద్ద సందడి



పరీక్ష సమయం దగ్గర పడడంతో పరుగు తీస్తున్న విద్యార్థి

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు..!



- ఈ ఏడాది 366 రోజులు
- నేడు లీప్ ఇయర్ డే
- నాలుగేళ్లకోసారి అదనపు రోజు

సాక్షి, మంచిర్యాల డెస్క్: ఈ రోజు అదనం.. ప్రతీ సంవత్సరం సాధారణంగా ఫిబ్రవరిలో 28 రోజులు ఉంటాయి. కానీ ఈ ఏడాది 29 రోజులు ఉన్నాయి. 366 రోజులు ఉంటాయి.. ఎందుకంటే ఇది లీపు సంవత్సరం. భూ పరిభ్రమణానికి 365 రోజుల మీద పావు రోజు పడుతుంది. ఇలా నాలుగేళ్లకోసారి ఆ పావు రోజులు కలిపి ఒక రోజు అదనంగా చేరుతుంది. అలా ఫిబ్రవరిలో 29 రోజులు వచ్చిన సంవత్సరాన్ని లీపు సంవత్సరం అంటారు. ఈ రోజు జన్మించినా.. పెళ్లి రోజయినా ఓ ప్రత్యేకత ఏర్పడుతుంది. నేడు లీపు ఇయర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ఫిబ్రవరి 29న జన్మించిన వారిని లీప్లింగ్, లీప్ ఇయర్ బేబీగా పిలుస్తారు. ఒక్కో దేశంలో ఒక్కో విధంగా జన్మదినం జరుపుకుంటారు. యూకే, హాంగ్‌కాంగ్‌లో మార్చి ఒకటిన, న్యూజిలాండ్ వాసులు ఒక రోజు ముందే 28న నిర్వహిస్తారు.

చరిత్రలో ఈ రోజు..
దివంగత మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ 1896 ఫిబ్రవరి 29న జన్మించారు. మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యోమంలోనూ పాలుపంచుకున్నారు. అనేక సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. కేంద్ర హోంమంత్రి, ఆర్థిక మంత్రి పదవులతోపాటు భారతదేశ రెండో ఉప ప్రధానిగా, 1977–79 మధ్యకాలంలో భారత దేశ నాలుగో ప్రధానిగా పని చేశారు.

ఎప్పటికీ గుర్తుండేలా..
లక్ష్యం.. కల.. భవిష్యత్ ప్రణాళిక ఇలా ఏదైనా సరే ఎంచుకోండి. ఈ ప్రత్యేకమైన రోజున మళ్లీ నాలుగేళ్లకు గుర్తు చేస్తూ మన గమ్యం ఎక్కడి వరకు చేరామో తెలుసుకునేలా ఓ లేఖ రాసుకోండి. మీ ఫోన్ నుంచి మీకు మీరే మెయిల్ చేసుకుంటూ మళ్లీ నాలుగేళ్లకు గుర్తు చేసేలా షెడ్యూల్ సెట్ చేసుకోండి. మీ ఫోన్‌లో క్యాలెండర్ ఓపెన్ చేసి టాస్క్ ద్వారా సేవ్ చేసుకుంటే భవిష్యత్‌లో గుర్తు చేస్తుంది. ముఖ్యంగా పిల్లలు ఇలా చేస్తే నాలుగేళ్లలో ఎంత మార్పు వచ్చింది అనేది ఇట్టే తెలిసిపోతుంది.

పెళ్లయి 32 ఏళ్లు.. ఎనిమిదో పెళ్లిరోజు



పిల్లలతో వెంకటేశ్వర్లు దంపతులు

మందమర్రిరూరల్: మాకు 1992 ఫిబ్రవరి 29న వివాహం జరిగింది. ఇప్పటికి పెళ్లయి 32 సంవత్సరాలు అవుతున్నా మా పెండ్లి రోజు నాలుగేళ్లకోసారి రావడంతో 2024 ఫిబ్రవరి 29న 8వ పెళ్లి రోజు జరుపుకుంటున్నాం. ఇలా నాలుగేళ్లకోసారి పెళ్లి రోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉంటుంది. ఆ రోజు మా కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి ఒక వేడుకలా జరపుకుంటాం. ఈ రోజు మళ్లీ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటాం. కుటుంబ సభ్యులతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం. మాకు ఇద్దరు పిల్లలు.. పాప డాక్టర్ మైత్రి రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో అనేస్థిషియన్ స్పెషలిస్టుగా, బాబు భార్గవ్ హైదరాబాద్‌లో ప్రాజెక్టు మేనేజర్‌గా పని చేస్తున్నారు.– రాంభాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులు

మరిచిపోలేని రోజు



జన్నారం: మాది జన్నారం గ్రామం. నాలుగేళ్లకోసారి వచ్చే ప్రతీ లీప్ ఇయర్‌లో ఫిబ్రవరి 29న పెళ్లి జరగనుండడం ఎగ్జయిట్‌మెంటుగా ఉంది. లీపు ఇయర్‌లో ఈ రోజు పెళ్లిళ్లు చేసుకోవడం చాలా అరుదు. మాకు ముహూర్తం ప్రకారం అదే రోజు రావడం సంతోషం అనిపిస్తుంది. ముందుగా కొంత ఇబ్బంది అనిపించినా వెరైటీగా ఉంటుందనే ఉద్దేశంతో అదే తేదీ ఖరారు చేసుకున్నాం. మరిచిపోలేని రోజు ఇది. నాలుగేళ్లకోసారి మా పెండ్లి రోజు ఘనంగా నిర్వహించుకునే అవకాశం ఉంది. – కార్తీక్, భూమిక, జన్నారం

వెరైటీగా ఉండాలని



తాంసి: ప్రతీ నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి 29న పెళ్లి చేసుకుని వెరైటీగా ఉండాలని ముందుగానే నిర్ణయించుకున్నాం. గురువారం రామలింగేశ్వర ఆలయంలో పెళ్లి జరగనుంది. పెళ్లి ముహూర్తాలు పెద్దలు చూసినప్పటికీ ఫిబ్రవరి 29న వివాహం జరుపుకోవాలని పెద్దలను సైతం ఒప్పించాం. వారి అంగీకారంతో నేడు వివాహం చేసుకోబోతున్నాం.
– అశోక్, నాయని, తాంసి

ఈ రోజు పెళ్లి ఓ ప్రత్యేకత



నెన్నెల: లీప్ ఇయర్‌లో ఫిబ్రవరి 29న మా పెళ్లి జరగనుండడం ఓ ప్రత్యేకతగా భావిస్తున్నాం. నాలుగేళ్లకోసారి వస్తుండడంతో ఈ రోజే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. ఈ మేరకు ముహూర్తం కూడా కుదరడం మా అదృష్టం. అందరిలా కాకుండా భిన్నంగా మా పెళ్లి రోజును నాలుగేళ్లకోసారి ఆనందంగా నిర్వహించుకునే అవకాశం దక్కింది. ఎదురుచూసి చేసుకునే ఏ సెలబ్రేషన్‌నైనా రెట్టింపు ఉత్సాహాన్ని ఇస్తుంది. అలాంటిది నాలుగేళ్లకోసారి మ్యారేజ్‌డే నాలుగింతల ఆనందాన్ని కలిగిస్తుంది. మా వివాహ రోజును ఒక పెళ్లి తంతుల ప్రతీ లీప్ ఇయర్‌లో ఘనంగా జరుపుకుంటాం. – పోగుల రాజేష్, సంధ్య, నెన్నెల

గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటా



మంచిర్యాలక్రైం: జన్మదిన వేడుక నాలుగు సంవత్సరాలకు ఒక్కసారి వస్తుంది కాబట్టి గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటా. అందరూ ప్రతీ ఏడాదికోసారి జరుపుకొంటే నేను నాలుగేళ్లకోసారి జరుపుకుంటా. మా బంధువులు, స్నేహితులు నువ్వు అదృష్టవంతుడివని అంటుంటారు. నాలుగేళ్లకోసారి బర్త్‌డే జరుపుకోవడం ఆనందంగా ఉంది.
– బత్తుల వెంకటేష్, మంచిర్యాల

గర్వంగా ఉంది..



మంచిర్యాలక్రైం: నాలుగు సంవత్సరాలకు ఒక్కసారి జన్మదిన వేడుకలు జరుపుకోవడం గర్వంగా ఉంది. నా స్నేహితుల జన్మదిన వేడుకలకు వెళ్లినప్పుడు అందరూ నన్ను ఆట పట్టిస్తారు. సుజాత బర్త్‌డే సమ్‌థింగ్ స్పెషల్ అంటుంటారు. నా బర్త్‌డేను బంధువులు, స్నేహితులకు చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాను.
– చిందం సుజాత, మంచిర్యాల, విద్యార్థిని


ఆశ్చర్యానికి గురవుతున్నాం..



బండి దిలీప్, మనీష, నస్పూర్


నస్పూర్: ప్రతీ నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి 29న మూడు ముళ్ల బంధంతో ఒక్కటి అవుతున్నందుకు సంబ్రమాశ్చర్యాలకు గురవుతున్నామని బండి దిలీప్, మనీష తెలిపారు. నస్పూర్‌కు చెందిన దిలీప్‌కు పెద్దపల్లి జిల్లా ఓదెలకు చెందిన కట్కూరి మనీషకు గురువారం ఓదెలలో వివాహం జరగనుంది. తమ పెళ్లి ముహూర్తం కుదిరిన సమయంలో ఇది లీప్ సంవత్సరం అని తెలియదని దిలీప్ పేర్కొన్నాడు. తర్వాత తమ మిత్రులు ఇది లీప్ సంవత్సరమని, పెళ్లి రోజు నాలుగేళ్లకోసారి వస్తుందని చెప్పడంతో ఒకింత ఆశ్చర్యం, ఆనందానికి గురయ్యామని అన్నాడు. మా పెళ్లి ముహూర్తానికి సమయం ఎప్పుడు దగ్గర పడుతుందా అని ఆత్రుతతో ఎదురు చూస్తున్నామని పేర్కొన్నాడు.

నాలుగింతల ఆనందం



ఆదిలాబాద్‌టౌన్: ప్రతీ యేడాది అందరిలా కాకుండా నాలుగేళ్లకు ఒకసారి నా జన్మదినాన్ని జరుపుకోవడం నాలుగింతల ఆనందాన్నిస్తుంది. మిగతా వారికి భిన్నంగా ఉంటుంది. నేను 1986 ఫిబ్రవరి 29న జన్మించాను. మాది ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీ. నేను స్థానికంగా ఉన్న విద్యార్థి కళాశాలలో కంప్యూటర్ సైన్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. నాలుగేళ్లకోసారి బర్త్‌డే రావడంతో మిత్రులు, బంధువులు ఘనంగా నిర్వహిస్తారు. ఇప్పటివరకు 12 వరకు బర్త్‌డేలు జరుపుకోవడం జరిగింది. – రాంకిరణ్, ఆదిలాబాద్

నేడు వివాహ బంధంలోకి..



కౌటాల(సిర్పూర్): కౌటాలలోని సదాశివపేటకు చెందిన చదువుల సాయి, కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన బొలిశెట్టి చైతన్య ఫిబ్రవరి 29న వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు. ఉదయం 11.25 గంటలకు భట్టుపల్లిలో పెళ్లి జరగనుంది. ఇద్దరికి ఇష్టమైన లిప్ సంవత్సరం ఫిబ్రవరి 29న పెళ్లి ఆనందంగా ఉందని వధూవరులు సాయి, చైతన్య తెలిపారు.

క్లుప్తంగా

ట్రిపుల్‌ఐటీలో సైన్స్ డే

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్‌ఐటీలో బుధవారం సైన్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీలోని నాలుగు విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌ఐటీ వరంగల్ ప్రొఫెసర్ విష్ణు శంకర్ పాల్గొని మానవ జీవితంలో సైన్స్ ఆవశ్యకతను వివరించారు. శాస్త్రవేత్తలను వారి ప్రయత్నాలను అభినందించాలన్నారు. సైన్స్‌లేకుండా మానవ జీవితం ఎలా ఉండేదో? సైన్స్ వచ్చాక ఎలా ఉందో అనే విషయాలను వెల్లడించారు. ఆధునిక సాంకేతికతతో మెకానిక్ పరిణామక్రమాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ శోభ, ఫిజిక్స్ డిపార్టుమెంట్ నరేశ్, మ్యాస్ హెడ్ అఫ్ ది డిపార్టుమెంట్ మధుసూదన్, బయోసైన్స్ డిప్ ఎడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ రాకేశ్‌రెడ్డి, అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, డాక్టర్ మహేశ్, డాక్టర్ చంద్రశేఖర్, విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపిక

బోథ్: మండలంలోని కనుగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నల్ల అర్చన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని సత్కరించారు. గైడ్ టీచర్ నిఖిలేష్ సూచనల వల్లే సూర్యుని ద్వారా సౌర ఫలకాల ద్వారా గరిష్ట శక్తిని ఎలా పొందవచ్చో ప్రయోగాత్మకంగా నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోశెట్టి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోంచి కాపర్ వైరు చోరీ

భైంసా(ముధోల్): బాసర మండలం కౌట గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌లోంచి కాపర్ వైరు చోరీకి గురైంది. లిఫ్ట్ ఇరిగేషన్ సమీపంలోని పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్ తీగను ఎత్తుకువెళ్లారు. దీంతో ఐదు వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఆటో దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఆటో చోరీకి పాల్పడిన నిందితుడిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చిచ్‌ధరి ఖానాపూర్‌కు చెందిన వాగ్మారే సతాగత్ గతేడాది డిసెంబర్ 28న భార్య కాన్పు కోసం ఆటోలో రిమ్స్‌కు వెళ్లాడు. ఎమర్జెన్సీ వార్డు ఎదుట ఆటోను పార్కింగ్ చేయగా మరుసటి రోజు ఆటో కనిపించకుండా పోయింది. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఎస్సై ఆధ్వర్యంలో కానిస్టేబుల్ రమేశ్, క్రాంతికుమార్ పట్టణంలోని ఠాకూర్ హోటల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో జైనూర్ మండలంలోని గౌరి గ్రామానికి చెందిన షేక్‌అబ్బు ఆటోను ఆపి పత్రాలు అడగగా లేకపోవడంతో అనుమానం వచ్చి విచారించగా ఆటో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

క్రీడాపాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ఐదోతరగతిలో ప్రవేశం కోసం జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 5న జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడాపాఠశాలలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి ఒక్కో పాఠశాలకు 40 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20 మందిని హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడా పాఠశాలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

జ్వరంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

- సిబ్బంది నిర్లక్ష్యంతోనేనని కుటుంబ సభ్యుల ఆందోళన
- ఐటీడీఏ డీడీ హామీతో విరమణ



ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జైనథ్ మండలం మాంగుర్లకు చెందిన తొడసం నాగోరావ్, లక్ష్మీబాయి దంపతుల కుమార్తె తొడసం మహేశ్వరి(12) జ్వరంతో మృతి చెందింది. మామిడిగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న బాలిక కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న నాగోరావ్ మంగళవారం బాలికను ఇంటికి తీసుకెళ్లాడు. ఆరోగ్యం క్షీణించడంతో అదే రోజు రాత్రి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆదివాసీ సంఘాల నాయకులు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి రిమ్స్ ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతిగృహ సిబ్బంది సకాలంలో చికిత్స చేయించి ఉంటే విద్యార్థిని బతికేదన్నారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్ నిర్లక్ష్యం, ఏటీడీవో నిహారిక పర్యవేక్షణ లోపంతోనే ఈ సంఘటన జరిగిందని ఆరోపించారు. ఇదే వసతి గృహంలో గతేడాది అక్టోబర్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని మృతి చెందిందన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, హెచ్‌ఎం, ఏటీడీవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఎక్స్‌గ్రేషియా విషయంలో ప్రభుత్వానికి నివేదిస్తామనడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు వెట్టి మనోజ్, ఉయిక సంజీవ్, ఉయిక ఇందిరా, విద్యార్థి సంఘాల నాయకులు సచిన్, భాస్కర్, గణేశ్, సలాం వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై కేంద్రం ఆరా

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మహేశ్వరి మృతిపై కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆరా తీసింది. బాలిక జ్వరంతో మృతి చెందడంపై ఆగ్రహించిన ఆది వాసీలు జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై మీడియాలో కథనాలు రావడంపై స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధికారులు వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. దీనికి సంబంధించి సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించారు. బాలిక జ్వరంతో మృతి చెందిందా? ఇతర కారణాలున్నాయా? జ్వరం వచ్చినా పాఠశాల సిబ్బంది ఎందుకు ఆసుపత్రికి తీసుకెళ్లలేదు? వంటి అంశాలతో కూడిన నివేదికను ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఈ విషయంపై డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను సంప్రదించగా విచారణ జరిపి పూర్తిస్థాయి నివేదిక అందజేస్తామని తెలిపారు.

హెచ్‌ఎంపై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌పై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై ముజాహిద్ తెలి పారు. జైనథ్ మండలం మాంగుర్ల గ్రామానికి చెందిన తొడసం నాగోరావ్ కూతురు మహేశ్వరి ఆదిలా బాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ ఆశ్ర మ పాఠశాలలో ఏడోతరగతి చదువుతోంది. తన కూతురు అనారోగ్యానికి గురైనా ఆసుపత్రికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేశారని, హెచ్‌ఎం నిర్లక్ష్యంతో నే తన కూతురి ఆరోగ్యం క్షీణించి మృతి చెందింద ని బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో నీటమునిగి ఒకరు మృతి, మరొకరు గల్లంతు



సాయి (ఫైల్)



శ్రీహరి (ఫైల్)

తలమడుగు(బోథ్): సరదాగా ఈత కోసం వెళ్లి ఒకరు మృతి చెందగా మరొకరు గల్లంతైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తలమడుగు మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన దారట్ల సాయి అలియాస్ వినోద్ (18), మర్రిపల్లి గ్రామానికి చెందిన సోయం శ్రీహరి (16) బుధవారం గ్రామంలో వ్యవసాయ కూలీపనికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో స్నానం చేసేందుకు జక్కుల ఓం ప్రకాష్ పొలంలోని బావి వద్దకు వెళ్లి తాడు సాయంతో లోనికి దిగారు. ఈత రాకపోవడంతో బావిలో మునిగిపోయారు. ఎంతకూ రాకపోవడంతో సమీపంలో పనిచేస్తున్న రైతులు బావి వద్దకు వెళ్లి చూడగా బట్టలు, చెప్పులు, సెల్‌ఫోన్ గమనించారు. చుట్టుపక్కల కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై దనశ్రీ, ఏఎస్సై సురేందర్ ఈతగాళ్ల సాయంతో బావిలో గాలించగా సాయి మృతదేహం లభ్యమైంది. శ్రీకాంత్ శవం దొరకక పోవడంతో పాటు చీకటి పడడంతో తిరిగి వెళ్లిపోయారు. కాగా దారట్ల శంకర్, నంద దంపతుల ఒక్కగానొక్క కుమారుడు సాయి మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దనశ్రీ తెలిపారు.

హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో జిల్లావాసి మృతి



స్వైశిక్ (ఫైల్)

బజార్‌హత్నూర్: హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బజార్‌హత్నూర్‌కు చెందిన కొత్త స్వైశిక్ (21) మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త లక్ష్మణ్, మమత దంపతుల పెద్ద కుమారుడు స్వైశిక్ హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తన మిత్రుడి తమ్ముడిని ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తుండగా ఔటర్ రింగ్ రోడ్డులో కారు బోల్తా పడి స్వైశిక్ మృతి చెందాడు. మృతుని తండ్రి లక్ష్మణ్ ఆదిలాబాద్‌లో ఆర్‌ఎస్సైగావిధులు నిర్వహిస్తున్నాడు.

కాలిబూడిదైన ఎలక్ట్రిక్ బైక్



కాలిబూడిదైన ఎలక్ట్రిక్ బైక్

ఆదిలాబాద్‌టౌన్: ఓ వ్యక్తి కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ బైక్ 24 గంటల వ్యవధిలోనే కాలి బూడిదైన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బేల మండలానికి చెందిన ఓ వ్యక్తి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఎబిలిటి ఈవీ, డిలైట్ కంపెనీ నుంచి ఈనెల 26న ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశాడు. 27న ఉదయం వాహనానికి పూజ చేశాడు. రాత్రి నడుపుతుండగా అందులో నుంచి పొగలు రావడంతో బైక్ దిగి పక్కన పెట్టగా మొత్తం కాలిపోయింది. బాధితుడు కంపెనీ యజమానులకు సమాచారం అందించాడు. మరో వాహనం ఇచ్చేందుకు వారు ముందుకొచ్చినట్లు తెలిసింది.

అదుపుతప్పి ఆటో బోల్తా



ఘటనాస్థలిలో ప్రయాణికులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అనుకుంట సమీపంలో బుధవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. బంగారుగూడ నుంచి ఆదిలాబాద్‌కు వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

పత్తి ధర పైపైకి

భైంసాటౌన్(ముధోల్): భైంసా మార్కెట్‌లో పత్తి ధర క్రమంగా పెరుగుతోంది. ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో బుధవారం క్వింటాలుకు రూ.7,300 చెల్లించారు. ప్రారంభంలో క్వింటాలుకు రూ.6,500 నుంచి రూ.6,900 వరకు మాత్రమే చెల్లించడంతో చాలామంది రైతులు సీసీఐ కేంద్రాల్లో రూ.7,020కి విక్రయించారు. కొద్దిరోజులకు సీసీఐ సైతం ధర తగ్గించి కొనుగోలు చేసింది. ప్రస్తుతం రైతుల వద్ద ఉన్న పత్తి నిల్వలు దాదాపు విక్రయించేశారు. దీంతో ప్రైవేట్‌లో ధర పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. రైతుల వద్ద పత్తి నిల్వలు ఉన్నప్పుడు ధర తగ్గించి కొనుగోళ్లు జరిపి, ప్రస్తుతం నిల్వలు చివరిదశకు చేరుకున్న తరుణంలో ధరలు పెంచడం వ్యాపారుల మాయాజాలమేనని రైతులు ఆరోపిస్తున్నారు. భైంసా మార్కెట్ పరిధిలోని ప్రైవేట్ జిన్నింగు మిల్లుల్లో ఇప్పటివరకు 1,95,491.97 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరుపగా సీసీఐ ఆధ్వర్యంలో 2,55,277.70 క్వింటాళ్లు కొనుగోలు చేశారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు



గాయాలపాలైన రుక్మాబాయి

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని భైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై రో డ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శాస్త్రినగర్‌కు చెందిన రుక్మాబాయి భైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై వైన్స్ వద్ద రోడ్డు దాటే క్రమంలో నిర్మల్ వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో మహిళ తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆటోలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థికి గాయాలు



గాయపడిన విష్ణువర్ధన్

ఇచ్చోడ(బోథ్): రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నేరడిగొండకు చెందిన విష్ణువర్ధన్ ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల పరీక్ష కేంద్రంలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష రాసేందుకు స్కూటీపై బయలుదేరాడు. సాథ్‌నంబర్ గ్రామం వద్ద 44 వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న బస్సును వెనకనుంచి ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. దీంతో మొదటిరోజు పరీక్షకు గైర్హాజరయ్యాడు.

మలేషియాలో లక్ష్మణచాంద వాసి మృతి



భీమేశ్ (ఫైల్)

లక్ష్మణచాంద(నిర్మల్): మండల కేంద్రానికి చెందిన దొనకంటి భీమేశ్ (48) నాలుగు నెలల క్రితం బతుకుదెరువుకోసం మలేషియా వెళ్లాడు. అక్కడ పనిచేస్తూ ఈ నెల 24న మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు బుధవారం మలేషియా నుంచి ఫోన్ ద్వారా అతని మిత్రులు సమాచారం అందించారు. బతుకుదెరువు కోసం వెళ్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. తన భర్త మృతదేహం ఎలాగైనా స్వగ్రామానికి తెప్పించాలని మృతుని భార్య రుక్మ ప్రభుత్వాన్ని కోరుతోంది.

మీసేవ కేంద్రంపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని రాజా జిరాక్సులో నిర్వహిస్తున్న మీసేవ కేంద్రంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. కుల ధృవీకరణ పత్రాల కోసం అధిక రుసుం వసూలు చేస్తున్నారని ఆధారాలతో బాధితులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. ఆర్ఐ ఎండీ ఖాలిక్ విచారణలో వాస్తవాలు వెలుగుచూడటంతో స్టేషనరీ, స్టాంపులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువతి మృతి చెందింది. టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని ఖండాల గ్రామానికి చెందిన నిషా (22) ఈనెల 24న కుటుంబ సభ్యులతో కలిసి అమ్మమ్మ ఊరైన మహారాష్ట్రలోని చిందికి వెళ్లింది. రెండు రోజుల పాటు అక్కడ ఉన్న తర్వాత తల్లిదండ్రులతో తమ ఇంటికి వెళ్దామని పేర్కొంది. దీంతో మృతురాలి తాత మందలించడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగింది. 27న ఉదయం ఆమె నోటి నుంచి నురుగు రావడంతో కుటుంబ సభ్యులు కిన్వట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి చౌహాన్ మంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఈవీఎంల మొదటిదశ తనిఖీ పూర్తి



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకోసం జిల్లాకు కేటాయించిన అదనపు ఈవీఎంల ఫస్ట్ లెవల్ తనిఖీ పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోడౌన్‌లో చేపట్టిన తనిఖీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోసం 1564 బ్యాలెట్ యూనిట్లు, 1067 కంట్రోల్ యూనిట్లు, 1322 వీవీప్యాట్‌ల మొదటి దశ తనిఖీలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశామన్నారు. జిల్లాకు అదనంగా కేటాయించిన 305 కంట్రోల్ యూనిట్ల ఫస్ట్ లెవల్ తనిఖీలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎల్‌ఎం కిట్లు వినియోగించుకోవాలి



విద్యార్థులకు కిట్లు ఇస్తున్న రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: దివ్యాంగ విద్యార్థులు టీఎల్‌ఎం కిట్లను వినియోగించుకోవాలని డీఈవో రవీందర్ రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో 15మంది ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి చెందిన విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. బీసీ కేటగిరీకి చెందిన విద్యార్థులకు కూడా త్వరలో పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐఈపీ ఐడీ సభ్యుడు శ్యామ్, జిల్లా విలీన విద్య సమన్వయ కర్త ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎంఈవో శంకర్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుచిత్ర, వివిధ మండలాల ఐఆర్పీలు నాగరాజు, రాకేశ్, రవి, నరేశ్, విజయ్, భూమన్న, సంతోష్, లక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే అభివృద్ధి

మామడ: సైన్స్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పొన్కల్ జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌డే కార్యక్రమంలో పాల్గొన్నారు. సైన్స్ ప్రాజెక్టులు తిలకించి విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలలో ఎస్సీసీ నిర్వహణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌కుమార్, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణారెడ్డి, వీఈడీసీ సభ్యులు శేఖర్, అశోక్, కిషన్, గంగన్న తదితరులున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

లక్ష్మణచాంద: శాంతి భద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బోరిగాం అనుబంధ గ్రామమైన బోరిగాం తాండాలో కమ్యూనిటీ కాంటాక్ట్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో గుడుంబా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 11 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు శ్రీకాంత్, సంతోషం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ సన్నాహక సమావేశం

నిర్మల్: మార్చి4న ప్రధానమంత్రి మోదీ రాక నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధికి సంబంధించి గురువారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయన్నగారి భూమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ సన్నాహక సమావేశం ఉదయం 11 గంటలకు ఉంటుందని చెప్పారు. పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్‌తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మండల అధ్యక్ష స్థాయి ఆపైన పార్టీ బాధ్యతలున్నవారు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు టీఎస్ యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం

నిర్మల్ రూరల్: టీఎస్ యూటీఎఫ్ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి ఏ.వెంకట్ హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు. సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పూదరి హరీశ్‌గౌడ్‌కు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్, పట్టా అందుకుంటున్న హరీశ్‌గౌడ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన పూదరి హరీశ్‌గౌడ్ మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ (ఎంఫిల్)లో చేసిన విశేష పరిశోధనకుగానూ బంగారు పతకం సాధించాడు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన 16వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, తెలుగు యూనివర్సిటీ ఆచార్య తంగెడ కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, ఎంఫిల్ పట్టా అందుకున్నాడు. 'కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రజా సంబంధ ప్రచార ప్రభావం-తెలంగాణ రాష్ట్ర అధ్యయనం' అనే అంశంపై 2016-17 బ్యాచ్‌కు చెందిన హరీశ్‌గౌడ్ చేసిన విస్తృత స్థాయి పరిశోధనకు బంగారు పతకాన్ని అందుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడికి గాయాలు

వేమనపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలో ఇద్దరు చిన్నారులు కొట్టుకోవడంతో ఒకరికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ముల్కలపేట పాఠశాల అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. డోలె ప్రదీక్ అనే బాలున్ని మరో బాలుడు కొరకడంతో మెడ, వీపుపై గాయాలయ్యాయి. అంగన్‌వాడీ సిబ్బంది గాయాలపై పసుపు రాసి ఇంటికి పంపించారు. పైగా విషయం తల్లిదండ్రులకు చెప్పవద్దని బెదిరించారు. ప్రదీప్‌కు స్నానం పోస్తుండగా అతని తల్లి గాయాన్ని గమనించి ప్రశ్నించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజితకు ఫిర్యాదు చేసినట్లు బాలుని తండ్రి రాజబాబు తెలిపారు.

రేషన్ ఈకేవైసీకి నేడే గడువు

భైంసాటౌన్(ముధోల్): రేషన్ లబ్ధిదారుల పారదర్శకత కోసం ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా ఆయా రేషన్ డీలర్ల పరిధిలో ఉన్న లబ్ధిదారులందరి వేలిముద్రలను ఈపాస్ యంత్రంలో నమోదు చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఈ ప్రక్రియ ప్రారంభం కాగా జనవరి 31వరకు గడువు విధించారు. లబ్ధిదారులకు అవగాహన లేకపోవడం, కార్డుదారులు వృత్తి రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లడం, పిల్లలు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో నమోదు అంతంత మాత్రంగానే జరిగింది. దీంతో ఫిబ్రవరి నె లాఖరు వరకు గడువు పొడిగించారు. ఈనెలాఖరుతో రేషన్ కార్డుల ఈకేవైసీ ముగియనుండగా జిల్లాలో ఇప్పటి వరకు 79.18 శాతం ప్రక్రియ పూర్తయింది.



తాంసి(బోథ్): భీంపూర్ మండలంలోని భగవాన్‌పూర్‌లో బుధవారం నెమలి పురివిప్పి కనువిందు చేసింది. భగవాన్‌పూర్ అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ఇళ్ల సమీపంలోని వచ్చిన మయూరం ఆహ్లాదకరమైన వాతవరణం ఉండడంతో తన పురివిప్పి ఆడింది. కనువిందు చేస్తున్న నెమలి ఫొటోలను గ్రామస్తులు కెమెరాల్లో బంధించారు.

క్లుప్తంగా

వేతనాలు ఇచ్చారు.. చెత్త తొలగించారు


చెత్తను తొలగిస్తున్న డీఎల్‌పీవో

ఇచ్చోడ: మూడు నెలల నుంచి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు పనులకు హాజరుకాకపోవడంతో రోడ్లపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో పడకేసిన పారిశుధ్యం అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీఎల్‌పీవో ఫనీందర్ ఇచ్చోడ మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. కార్మికులకు నెల వేతనాలను చెల్లించి పనులకు హాజరయ్యే విధంగా చొరవ చూపారు. బుధవారం డీఎల్‌పీవో ఇచ్చోడ మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను బుధవారం ఉదయం స్థానిక ఈవో సూర్యప్రకాశ్‌తో కలిసి పర్యవేక్షించారు. దీంతో గత ఐదు రోజుల నుంచి రోడ్లపై దర్శనమిచ్చిన చెత్తను కార్మికులు తొలగించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండ సాంగ్వి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం మార్కండేయ విగ్రహప్రతిష్ఠాపన చేయనున్నారు. అందులో భాగంగానే బుధవారం పద్మశాలి కులస్తులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మార్కండేయ విగ్రహా ప్రతిష్ఠాపనకు జిల్లాలోని పద్మశాలి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డిప్యూటేషన్ రద్దు చేయాలి

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గణిత శాస్త్ర ఉపాధ్యాయుడి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని తేజాపూర్ గ్రామస్తులు ఒక ప్రకటనలో కోరారు. జిల్లా విద్య శాఖ అధికారి ప్రణీత డిప్యూటేషన్‌పై వేరేచోటకు పంపించడం అన్యాయమని పేర్కొన్నారు. ముగ్గురు ఉపాధ్యాయుల్లో ఒకరిని డీఈఓ డిప్యూటేషన్‌పై పంపడంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు

కైలాస్‌నగర్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్‌లను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్ హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం వేర్వేరుగా కలిసిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు దరఖాస్తును అందజేశాడు.

పక్షులు అంతరించకుండా చూడాలి

నేరడిగొండ: పక్షులు అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేష్, సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్‌లు అన్నారు. ప్రకృతితో స్నేహం – పక్షులకు సహాయం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గుత్పాల గ్రామంలోని మినీ గురుకుల పాఠశాల, బుగ్గారాం గ్రామంలోని ట్రైబల్ వేల్ఫేర్ అప్‌గ్రేడెడ్ రెసిడెన్షియల్ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రముఖుడు అభిలాష్, ఇరు పాఠశాలల ప్రిన్సిపాళ్లు అరుణ, కృష్ణవేణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో పేదలకు న్యాయం

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. సొనాల గ్రామంలో బుధవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరారు. వీరికి గజేందర్, అరుణ్ కుమార్‌లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరంగా గ్రామంలో పలు కుటుంబాలకు పరామర్శించారు. నాయకులు శేఖర్, గాజుల పోతన్న, అనిల్, రమేష్, అనీష్, సిర్పూర్ మహేష్, లోలపు పోశెట్టి, పవన్, విజయ్ భాస్కర్‌రెడ్డి తులసీరామ్, రవిలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని పరిశ్రమల శాఖ మేనేజర్ పద్మభూషణ్ రాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఇచ్చోడ: గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్లు నరేష్, ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్, కౌన్సెలర్లు వినోద్, సంతోష్ ఉన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం


నార్నూర్: విద్యార్థినులు వినూత్న ఆలోచనతో తయారు చేసిన పరికరాలు


ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల ప్రదర్శనలు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలని జిల్లా విద్యా శాఖ అకాడమి మానిటరింగ్ అధికారి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. సైన్స్ డేను పురస్కరించుకుని బుధవారం స్థానిక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌ను పుస్తకాలకే పరిమితం చేయవద్దని, శాస్త్ర విజ్ఞానాన్ని నిత్యజీవితంతో అన్వయిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయత, తార్కిక ఆలోచన, జిజ్ఞాసను కలిగి ఉంటే శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని ప్రత్యేక అధికారి ప్రశాంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించిన సైన్స్ ఉపాధ్యాయుడు హర్షిత్ కుమార్‌ను అభినందించారు. యూఆర్‌ఎస్ విద్యార్థులకు ట్రాక్ సూట్లు, క్రికెట్ కిట్లు బహుకరించిన ఫిరోజ్, నౌషద్ తరానీలను సన్మానించారు. సైన్స్ డే సందర్భంగా కేక్ కట్ చేశారు. ఉపాధ్యాయులు గణేష్, శకుంతల, ప్రశాంత్ కుమార్, దత్తు, బోధనేతర సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రసాంకేతిక రంగాలపై అవగాహన ఉండాలి

నార్నూర్: శాస్త్ర సాంకేతిక రంగాలపై పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులు పట్టుసాధిస్తూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా రాయి సెంటర్ సార్ మేడి మెస్రం దుర్గు పటేల్ అన్నారు. మండలంలోని జామ్‌డా గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌ను పీఎంఆర్సీ ఇన్‌చార్జి జగన్‌తో కలిసి ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, పిడి ఆడే విశ్వనాథ్, సైన్స్ అధ్యాపకురాలు ఎస్.రాజ్యలక్ష్మి, కల్పన, పుష్పలత, చంపావతి, ఆడే కైలాష్, రవీందర్ ఉన్నారు.

విద్యార్థులు ఆలోచన శక్తిని పెంచుకోవాలి

తాంసి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఆలోచన శక్తిని పెంచుకొని నూతన ఆవిష్కరణలు చేయాలని తాంసి జెడ్పీటీసీ రాజు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, ఎంపీపీ భర్త శ్రీధర్ రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు గోవర్ధన్, నరేష్, కృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అమరేందర్, పవన్, ఉమమాహేశ్వర్ ఉన్నారు.

సీవీ రామన్ సేవలు ఆదర్శం...

ఇంద్రవెల్లి: యువత సీవీ రామన్ సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంమోహన్ రావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు రాథోడ్ రోహిదాస్ పాల్గొన్నారు.

బోథ్‌లో..

బోథ్: మండలంలోని నాగబూషణం, కౌఠ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సొనాలలోని ఉషోదయ పాఠశాలతో పాటు వివిధ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు చేసిన ప్రయోగాలను కాంగ్రెస్ నాయకులు ఆడె గజేందర్, ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ పరిశీలించారు. కౌఠలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ షోను విడిసి అధ్యక్షులు సురేందర్ తిలకించారు.


తాంసి: విద్యార్థుల ప్రదర్శన తిలకిస్తున్న జెడ్పీటీసీ

నేరడిగొండలో..

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో ఎంఈఓ భూమారెడ్డి సైన్స్ ప్రదర్శనలను తిలకించారు. అంతకుముందు సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


నేరడిగొండ: వడూర్‌లో తిలకిస్తున్న ఎంఈవో


బోథ్: ప్రయోగ దీపికలను పరిశీలిస్తున్న గజేందర్


ఇంద్రవెల్లి: ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

ఎంపీపీ ఎన్నిక వాయిదా

• రసవత్తరంగా మారుతున్న ఎన్నిక


ఎన్నికలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు


వాగ్వాదం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గుడిహత్నూర్: ఎంపీడీవో సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి ఎన్నిక వాయిదా పడింది. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ఎన్నిక ప్రక్రియను ప్రిసైడింగ్ అధికారి వెంకటేశ్వర్లు నిర్వహించారు. మండలంలోని ఎనిమిది మంది ఎంపీటీసీలు ఎంపీపీను ఎన్నుకోవాల్సి ఉంది. మూడు ప్రధాన పార్టీలకు చెందిన వీరంతా ఎవరికి వారు తమ పార్టీ ప్రతిష్ఠను కాపాడుకోవడానికి మూడు రోజులుగా ఎంపీటీసీలను రకరకాలుగా ఆఫర్లు ఇస్తూ తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఎనిమిది మందిలో ఇద్దరు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్, ముగ్గురు బీఆర్‌ఎస్ అభ్యర్థులు. వీరిలో నుంచి ఎవరో ఒక్కరికి ఎంపీపీగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. బుధవారం నిర్వహించిన ఎన్నికకు వీరంతా హాజరయ్యారు. బీఆర్‌ఎస్ తరఫున మన్నూర్ ఎంపీటీసీ కేంద్రె జ్ఞానోబా అధ్యక్ష బరిలో ఉన్నారని తోషం ఎంపీటీసీ షగీర్‌ఖాన్ ప్రతిపాదించగా, మచ్చాపూర్ ఎంపీటీసీ వచ్చలాబాయి బలపరిచారు. కాంగ్రెస్ తరఫున గురుజ ఎంపీటీసీ పెందూర్ లలిత అధ్యక్ష బరిలో ఉన్నారని గుడిహత్నూర్ ఎంపీటీసీ అంకతి సవిత ప్రతిపాదించగా కమలాపూర్ ఎంపీటీసీ కృష్ణవేణి బలపరిచారు. బీజేపీ తరఫున ఉన్న శాంతాపూర్ ఎంపీటీసీ భరత్, గుడిహత్నూర్–2 ఎంపీటీసీ కోవ తులసి పోటీకి దూరంగా ఉన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి రెండు ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి పెందూర్ లలితకు రెండు ఓట్లు దక్కాయి. ఇరువురికి సమానంగా ఓట్లు రావడంతో ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రిసైడింగ్ అధికారి వెల్లడించారు. అయితే మరో రోజు సమయం దొరకడంతో అభ్యర్థులు ఎలాగైన మరో రెండు ఓట్లను తమ వైపు తిప్పుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. నేడు నిర్వహించే ఎన్నిక రసవత్తరంగా మారనుంది. ఎన్నిక సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ కార్యాలయానికి రాగా అధికారులు ఆయనను ఎంపీపీ గదిలో కూర్చోబెట్టారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్‌ఎస్ నాయకులు తాము కూడా గదిలో కూర్చుంటామని పట్టుపట్టడంతో కాసేపు పోలీసులు, అధికారులతో వాగ్వాదం జరిగింది. అప్పటికే ఎన్నిక వాయిదా పడడంతో వాగ్వాదం సద్దుమణిగింది. కాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లు తమ అభ్యర్థులను తమ ఆధీనంలో ఉంచుకోవడంతో పాటు ఇతర అభ్యర్థులను తమ వైపు తిప్పుకునేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ సమావేశంలో ఎన్నికల సహాయ అధికారులుగా ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై, వెంకటేష్‌లు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


తాంసి: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు


ఇచ్చోడ: కేంద్రానికి పరుగులు తీస్తున్న విద్యార్థులు

ఇచ్చోడ: ఇంటర్ పరీక్షలు బుధవారం మొదటి రోజు ప్రశాంతంగా మొదలయ్యాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో 513 విద్యార్థులకు 484 మంది పరీక్షలకు హాజరు కాగా 29మంది గైర్హజరైనట్లు సీఎస్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గిరిజన బాలుర కళాశాల కేంద్రంలో 465 మంది విద్యార్థులకు 432 హాజరు కాగా 33 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు సీఎస్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గిరిజన గురుకుల బాలికల కళాశాల కేంద్రంలో 532 విద్యార్థులకు 446 మంది విద్యార్థులు హాజరు కాగా 86 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్ లక్ష్మీకాంత్‌రావు తెలిపారు.

67మంది విద్యార్థుల గైర్హాజరు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాల్లో 490 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 423 మంది హాజరు కాగా 67 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ద్విచక్ర వాహనాలపై కేంద్రాలకు తీసుకొచ్చారు.

తాంసిలో..

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రథమ సంవత్సరం పరీక్షకు 448 మంది విద్యార్థులకు 436 మంది హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. ఎస్సై శివరాం ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరీక్షల వేళ.. తెరిచి ఉన్న జిరాక్స్ సెంటర్లు

ఇచ్చోడ: ఇంటర్ పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉండాలనే నిబంధనను కొంతమంది పాటించడం లేదు. ఇంటర్ పరీక్షలు నడిచినన్నీ రోజులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జిరాక్స్ సెంటర్లు, మీసేవ కేంద్రాలు మూసి ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ మండల కేంద్రంలో బుధవారం పలు జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉంచడం కనిపించింది.


సిరిచెల్మ చౌరస్తాలో తెరిచి ఉన్న జిరాక్స్ సెంటర్

గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం

నార్నూర్: భూపాలపల్లి జిల్లా కాటారం అటవీ ప్రాంతంలో 15రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ప్రవీణ్ కుటుంబ సభ్యులను బుధవారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు పరామర్శించారు. గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతిపై సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో విద్యుత్‌షాక్‌తో మృతిచెందడం బాధాకరమన్నారు. అతడి కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. వచ్చే నెల 4న ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు భారత ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్నారని గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ప్రవీణ్ కుటుంబ పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేష్, తాజా మాజీ సర్పంచ్ ఊర్వేత రూప్‌దేవ్, మాడవి రూప్‌దేవ్, రాథోడ్ సావిందర్ ఉన్నారు.


ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నేరడిగొండ: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వడూర్ గ్రామానికి చెందిన మహిళ నాయకురాలు వంజరి లక్ష్మితో పాటు ఆయన కుమారుడు రాజేందర్‌లను కండు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండల కేంద్రంలో డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు మంచినీటి సౌకర్యానికి అత్యధిక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, ఆ పార్టీ బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్ చందర్‌రెడ్డి ఉన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి గజేందర్

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

ఆదిలాబాద్‌రూరల్: మేరు సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేర కులస్తుల కుల గురువు సంత్ నాందేవ్ మహరాజ్ చిత్రపటానికి, కుట్టు మిషన్‌లకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కుల వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న మేరు కులస్తులను ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. అలాగే బ్యాంకులతో సంబంధాలు లేకుండా వంద శాతం సబ్సిడీపై పనిముట్లు ఇవ్వాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు మేకల అశోక్, నర్సాగౌడ్, సురేష్, విలాస్, జిల్లా మేరు సంఘం నాయకులున్నారు.

సామాజిక సేవ అలవర్చుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జగన్

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి, క్రమ శిక్షణ పెంపొందించుకొని సామాజిక సేవా ధృక్పథాన్ని అలవర్చుకోవాలని అకాడమిక్ మానిటరింగ్ అధికారి జె. జగన్ అన్నారు. తెలంగాణ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఉపాధ్యక్షులు రత్నాకర్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, క్యాంప్ అధికారి రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి స్వామి, ట్రైబల్ వెల్ఫేర్ స్కౌట్స్ ఇన్‌చార్జి యాదవరావు, పీడీ హేమంత్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తరుచుగా ప్రజలు వస్తుంటారు. ఈ నేపథ్యంలో వేసవి కాలం కావడంతో ప్రజల దాహార్తిని తీర్చడానికి బ్రదర్ హ్యూమెనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఎంఆర్‌వో ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో ఫౌండేషన్ అధ్యక్షుడు రాహెల్ ఖాన్, ఉపాధ్యక్షుడు జుబేర్ ఖాన్, మణికంఠ, నవీన్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎండి.ఖమర్ అహ్మద్ తెలిపారు. చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన మున్సిపల్ నూతన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో రావాలని ఆయన కోరారు.

క్షీరాభిషేకం

బేల: ఎన్నికల్లో ఇచ్చిన మరో రెండు హామీలు రూ.500కే గ్యాస్, ఇళ్లకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, బ్లాక్ అధ్యక్షుడు గుండవార్ సంజయ్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్ పాల్గొన్నారు.

మొక్కలను జాగ్రత్తగా పెంచాలి

ఇచ్చోడ: నర్సరీల ద్వారా పెంచుతున్న మొక్కలను వేసవిలో జాగ్రతగా చూసుకోవాలని డీఎల్‌పీవో ఫనిందర్ అన్నారు. బుధవారం మండలంలోని ముఖరా(కె)లో నర్సరీలో మొక్కలు, పల్లెప్రకృతి వనం, శ్మశానవాటిక, పంచాయతీ కార్యాలయాన్నీ పరిశీలించి మాట్లాడారు. ఎంపీవో సాయి ప్రసాద్, ఎంపీటీసీ గాడ్గేసుభాష్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, మాజీ సర్పంచ్ మీనాక్షి పాల్గొన్నారు.

వంట గ్యాస్ సిలిండర్లు పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను బుధవారం మావల మండలంలోని మహిళలకు మండల కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ఉచిత సిలిండర్ కనెక్షన్‌లను అందించడం జరుగుతుందన్నారు. దేశ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నరేంద్రమోడీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వంట గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ రిషి శంకర్, బీజేపీ నాయకులు వకులభరణం వేద వ్యాస్, కోర్రీ భుమేష్, రవిరెడ్డి, మురళి, సూర్యకాంత్ ఉన్నారు.

కిసాన్ కాంగ్రెస్ ఆందోళనలో జిల్లా నాయకులు

కైలాస్‌నగర్: ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి మద్దతుగా, కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ బుధవారం హైదరాబాద్‌లో చేపట్టిన ఆందోళనలో పలువురు జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, మావల మండల అధ్యక్షుడు శేఖర్, నాయకులు నవీన్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన నూతన కార్యవర్గం

కై లాస్‌నగర్: ఏఐటీయుసీ అనుబంధ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నికైంది. కమిటీ గౌరవ అధ్యక్షులుగా యస్. విలాస్, అధ్యక్షుడిగా ఎం.చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా ఎం.కాంతారావు ఎన్నికయ్యారు. బుధవారం ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలు తీర్చాలని కోరారు.





పిల్లలకు పరీక్ష.. తండ్రులకు నిరీక్షణ

ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం మొదలయ్యాయి. దీంతో విద్యార్థులను తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చి హాల్ టిక్కెట్ నంబర్లను వెతికి పరీక్ష కేంద్రంలోనికి పంపించారు. వారు పరీక్ష రాసేంత వరకు పరీక్ష కేంద్రాల ముందు నిరీక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆలయంలో పూజలు

నేరడిగొండ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. బుధవారం శాంతిపాఠం, గణపతి, గౌరిపూజ, పుణ్యాహవచనం, హోమం నిర్వహించారు.